www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024
5
చిత్తూరు




నర్సింగ్ పూర్తి చేస్తే జర్మనీలో ఉద్యోగం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జనరల్, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతులకు జర్మనీ దేశంలో ఉద్యోగ అవకాశాలున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి గుణశేఖర్ తెలిపారు. 35 సంవత్సరాల లోపు ఉన్న బీఎస్సీ, జిఎస్ఎం నర్సింగ్ రెండు, మూడు సంవత్సరాలు అనుభవం కలిగిన నిరుద్యోగ యువతకు జర్మనీలో ఆరు నెలల పాటు శిక్షణ, గుంటూరులో జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ విజయవంతంగా ముగించుకున్న అభ్యర్థులు జర్మనీ వీసా పొందిన తర్వాత ఆ డిపాజిట్ తిరిగి చెల్లించబడుతుందని, వసతి, భోజన వసతికి అయ్యే ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ ఈనెల 11వ తేదీ చేసుకోవాలని, 14వ తేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. వివరాల కోసం కాల్ సెంటర్ నెంబర్ 99888 53335ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగు భూమికి పట్టాలివ్వాలంటూ...

సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు






ప్రజాశక్తి - కెవిబిపురం సాగుభూమికి పట్టాలివ్వాలంటూ కెవిబిపురం మండలం కళత్తూరు దళితవాడ రైతులు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చెట్టు పుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలంటూ డిమాండ్ చేశారు. ఫారెస్టు ల్యాండ్‌కు ఆనుకుని వంద ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. ఆ భూమిలో చెట్టుపుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. తమ అధీనంలోని భూములకు పట్టాలివ్వాలంటూ ఏళ్ల తరబడి నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. అప్పట్లో స్థానిక ఎంఎల్ఎ, ఎంపి గ్రామానికి చేరుకుని ఫారెస్టు వారితో మాట్లాడి దళితుల జోలికి వెళ్లొద్దని చెప్పడంతో సద్దుమణిగింది. అప్పటినుంచి దళితులు ఆ పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఫారెస్టు రేంజి అధికారి రాధికారెడ్డి ఆ భూములన్నీ ఫారెస్టు, రెవెన్యూకు సంబంధించినవని, సాగు చేయరాదని, ఒకవేళ ధిక్కరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో దళితులు తమకు జీవనాధారమైన భూములే లేనపుడు తమకు ఈ ప్రాణాలు వద్దంటూ శనివారం రైతులు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అయినా వారి మాటను దళిత రైతులు పట్టించుకోకపోవడంతో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో, సిఐ, అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని టవర్‌పై ఉనన దళితులకు నచ్చజెప్పి కిందకు దింపారు. ఈ సందర్భంగా కళత్తూరు గ్రామానికి చెందిన నాగరాజ్ మాట్లాడుతూ కళత్తూరు రెవిన్యూ బ్లాక్ నెంబర్ 4 లో 2500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అయితే ఈ భూమిలో తమ తాతలు కాలం నుంచి సాగు చేస్తున్నామన్నారు. అయితే ఇప్పుడు ఫారెస్ట్ అధికారులు ఈ భూమి ఫారెస్ట్, రెవెన్యూకు చెందుతుందని, ఇందులో ఎవరు దిగడానికి వీలులేదని దళితులను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. తామంతా ఈ భూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఫారెస్ట్ అధికారుల నుంచి తమ భూములు తమకు వచ్చేలా ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే తమకు చావే శరణ్యమని వాపోయారు.

సప్తవర్ణ శోభితం...శ్రీవారి పుష్పయాగం

ప్రజాశక్తి -తిరుమల కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగ మహెూత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రా భరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు. చామంతి, సంపంగి, నూరు వరహాలు, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలిరేకులు, మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించారు.

ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం

శ్రీవారి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించేందుకు దాతల నుంచి పుష్పాలు సేకరించేందుకు కషి చేసిన టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులును ఆలయ అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకష్ణ పాల్గొన్నారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుండి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారని వెల్లడించారు.





తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం వేడుకగా జరిగింది. 12 రకాల పుష్పాలు, ఆరు రకాల ఆకులతోన ఇవేదన నిర్వహించారు. పుష్పయాగానికి సుమారు 3 టన్నుల పుష్పాలను వినియోగించారు. ఈ పుష్పయాగ మహెూత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు, స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ

108 సిబ్బంది నిరసన



ప్రజాశక్తి- విజయపురం (నగరి): సమస్యలు పరిష్కరించాలంటూ 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు శనివారం నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం, అధికారులు తమ సమస్యలను పరిష్కరించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే 108 సర్వీసులను నేరుగా నిర్వహించాలని కోరారు. ఇచ్చిన హామీ ప్రకారం స్లాబ్ ప్రాతిపదికన అందరికీ వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్లను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఇయంటి పోస్టుల్లో 108 ఇయంటిలను నియమించాలన్నారు. పైలెట్లు ఇయంటిలకు ఇతర ఖాళీల్లో వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియామకం చేపట్టాలన్నారు. పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలన్నారు. 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. సహజమరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్రేషియా చెల్లించాలన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన జీఓయంఎస్ నెం. 49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ. 4 వేలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలన్నారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ డిమాండ్లను అధికారులు పరిష్కరించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 25 నుంచి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తామన్నారు.

104 సిబ్బంది నిరసన



బంగారుపాళ్యం: జీవో 143ని రద్దు చేయాలని జిల్లా తెలుగునాడు అధ్యక్షులు శరత్ కుమార్ కోరారు. శనివారం తగ్గువారిపల్లి పంచాయతీలో 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వైద్యశాఖలో పనిచేస్తున్న సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్, జీవో 143 రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని, జనాభా ఆధారంగా సిబ్బంది విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డిపిఎంఓ మణి, 104 సిబ్బంది చక్రపాణి, మహిళ విభాగ నాయకురాలు రమాదేవి, ఆశ వర్కర్ భువనేశ్వరి పాల్గొన్నారు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పేదవారికి ఉచిత న్యాయసేవలు అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముఖ్యలక్ష్యమని డిఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మజ తెలిపారు. శనివారం స్థానిక ఆర్‌కె డిగ్రీ కాలేజీలోని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు న్యాయ సేవాధికార దినోత్సవం పురస్కరించుకొని విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వలన ఉన్నతమైన సమాజాన్ని నిర్మించవచ్చు అని తెలిపారు. యువత మత్తు పదార్థాతు, మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. అలాగే విద్యార్థినులు సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున పేద బాధితులకు, మహిళలకు, విభిన్న ప్రతిభావంతులకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి పద్మజ

అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టాలి

ప్రజా'దృష్టి'



రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యలు పరిష్కారం చేస్తామని ప్రతిష్టాత్మకంగా గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పడం మంచి పరిణామమే. దీంతో పేదలు ఎంతో ఆశతో తను అనుభవంలో ఉన్న భూములు తమకే దక్కుతాయని ఎదురు చూశారు. అయితే వారి ఆశలు అడియాసలయ్యే పద్ధతిలో గ్రామసభలు జరుగుతున్నాయి. జిల్లాలో అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరగడం లేదు. జిల్లాలో 32 మండలాల్లోనూ భూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రతి సోమవారం ప్రజాసమస్యల వేదికలో అత్యధికంగా వినతులు వస్తున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయంకే కాకుండా స్థానికంగా రెవెన్యూ డివిజన్లోను, తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రజావేదికల్లో కూడా అత్యధికంగా భూ సమస్యలే వస్తున్నాయి. భూ సమస్యలు పరిష్కారం చేసే లక్ష్యంగానే గ్రామసభలు పెడుతున్నామని అధికార యంత్రాంగం చెబుతున్నది. అయితే అది ఆరచణలో ఉండటం లేదు.

ప్రతి మండలంలోనూ ప్రతి గ్రామంలోనూ పేదలు, దళితుల భూములు వారి అనుభవంలో ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డులలో వాళ్ళ పేర్లతో కాకుండా అగ్రకులస్తుల పేర్లతో ఉండడంతో అర్హులైన వారు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 20,000 ఎకరాలు పేదల ఆధీనంలో ఉన్న వాటిని ఇతరులు పేర్లతో రికార్డులు ఉండడంతో పేదలు లబోది ఇవ్వమంటున్నారు. గ్రామసభలు మాత్రం ఎక్కడైతే ఫిర్యాదులు వచ్చాయో ఆయా గ్రామాల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. కానీ ప్రతి గ్రామంలోనూ భూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. నవంబర్ 20వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే రెవెన్యూ అధికారులు ఎవరైతే అధికారంలో ఉంటారో ఆ నాయకులు చెప్పిందే వేదంగా పనిచేస్తున్నారు. దీంతో తమ అనుభవంలో ఉన్న పేదల భూములను సైతం వదులుకోవాల్సిన పరిస్థితి వస్తున్నది.

పలమనేరు, పుంగనూరు, నగరి, చిత్తూరు లాంటి మండలాల్లో కొత్తగా రోడ్లు వస్తున్న ప్రాంతాల్లో భూములకి విలువ పెరగడంతో భూకబ్జాలు తీవ్రస్థాయిలో జరుగుతున్నాయి. రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని రికార్డుల్లో పేర్లు మార్చేసారని ప్రతి సోమవారం పేదలు ఆయా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. అయినా సమస్య పరిష్కార కావడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు సుమోటోగా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరాలంటే అన్ని మండలాల్లో గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ఎవరు ఆధీనంలో భూములు ఉన్నాయో నిగ్గుతేల్చి వారికి రికార్డులు ఇవ్వాలి. ముఖ్యమంత్రి జిల్లాలో అధికార యంత్రాంగం పేదలకు వారి భూములు వారికే దక్కే విధంగా పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎక్కడైతే ప్రజలు తిరగబడుతున్నారో అక్కడ అధికార యంత్రాంగం స్పందించి సర్వే చేయడంతో పేదల భూములు కబ్జాకు గురైందని స్పష్టంగా తేలుతోంది. ఉదాహరణకు మొగిలి యానాదులు భూములు అన్యాక్రాంతం అయ్యాయని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో సర్వే చేయగా పదిమందికి గతంలో అధికారులు తప్పుడు పద్ధతుల్లో పట్టాలు ఇచ్చినట్లు తేలింది. ఇలాంటి సంఘటనలు జిల్లాలో కోకొల్లలుగా ఉన్నాయి. ఇలాంటి వాటిని జిల్లా అధికార యంత్రాంగం తప్పుడు పట్టాలను రద్దుచేసి నిజమైన పేదలకు పట్టాలు ఇవ్వాలి. లేకుంటే ప్రజాగ్రహానికి గురికావాల్సి ఉంటుంది.


నామినేటెడ్ పదవుల్లో

జిల్లా నుంచి ఇద్దరికి స్థానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్



కఠారి హేమలత



సిఆర్ రాజన్

కూటమి ప్రభుత్వం ప్రకటించిన రెండో జాబితా నామినేటెడ్ పదవుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన మాజీ మేయర్ కఠారి మేమలత, టిడిపి జిల్లా అధ్యక్షులు సిఆర్.రాజన్‌కు స్థానం దక్కింది. మాజీ మేయర్ కఠారి హేమలతను చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా, సిఆర్.రాజన్‌ను వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సిఆర్ రాజన్ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం కోసం శ్రమించారు. చిత్తూరు అసెంబ్లీ టికెట్ ఆశించినా చివరి నిమిషంలో గురజాల జగన్‌మోహన్‌ను ఖరారు చేశారు. అలాగే చిత్తూరు కార్పోరేషన్ మేయర్ కఠారిహేమలత కూడా చిత్తూరు అసెంబ్లీ స్థానం నుండీ పోటీ చేసేందుకు మొగ్గుచూపారు. టిడిపి నగర అధ్యక్షులుగా ఉన్న కఠారి హేమలత చిత్తూరు నియోజకవర్గంలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో చుర్గుగా పాల్గొంటున్నారు. మాజీ మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్ జంట హత్యకేసులో అత్తమామలను కొల్పోయారు. రెండు సంవత్సరాలు చిత్తూరు నగర మేయర్‌గా పనిచేశారు. కఠారి హేమలతను చూడా ఛైర్‌పర్సన్‌గా, సిఆర్ రాజన్‌ను వన్నెకుల క్షత్ర కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడం పట్ల టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కఠారి హేమలత కఠారి అనురాధ దంపతుల సమాధి వద్ద నివాళ్ళు అర్పించి గంగనపల్లి నుండీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలో హిట్లర్, గడాఫీల పాలన

వైసిపి రాష్ట్ర అధికారప్రతినిధి ఆర్కేరోజా



ప్రజాశక్తి- విజయపురం (నగరి) రాష్ట్రంలో హిట్లర్, గడాఫీల సంయుక్త పాలన జరుగుతోందని, మూడు సింహాలను గౌరవించి పనిచేయాల్సిన పోలీసులు మూడు పార్టీలకు పనిచేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసులు కేసులు పెట్టి వేధించడంపై శనివారం నగరిలోరి తన నివాసంలో మీడియాతో ఆమె మాట్లాడారు. సోషల్ మీడియాకు చెందిన పెద్దరెడ్డి సుధారాణి అనే మహిళలను భర్త పిల్లలతో ఉండగా ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో కిడ్నాప్ చేసి శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారంటే అంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు. ఆమెను చిలకలూరి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి రెండు రోజులు హింసించి, ఒంగోలు డీఎస్పీ ఆఫీసులో రెండురోజులు హింసించి ఆ తరువాత గుంటూరు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచారంటే ఆ అధికారం వారికి ఎవరిచ్చారన్నారు. నానా బూతులు మాట్లాడారని, వాతలు తేలేలా ఎలా కొట్టారో ఆమె జడ్జికి చూపించడం పోలీసుల అరాచకానికి సాక్ష్యమన్నారు. నేడు సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి ఫెయిల్ అయ్యారని, ఆడపిల్లను రక్షించలేకపోతున్నారని, సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వారిని హింసిస్తున్నారన్నారు. తాగండి తాగి జీవితాలు నాశనం చేసుకోండి అన్న రీతిలో పాలన సాగుతోందన్నారు. స్కూలు పిల్లలు మద్యం తాగి వెళ్లారని వార్తలు చూస్తుంటే రాష్ట్రం ఎటువైపు పోతోందో అర్థం కావడం లేదన్నారు. విద్యాంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్‌గా మారిందన్నారు. ప్రభుత్వం నేరాల్ని ఆపలేక బాధిత కుటుంబాన్ని బెదిరించడానికి పూనుకున్నారన్నారు. ఇదే ఎర్రావారిపాళెంకు చెందిన బాలిక విషయంలో జరిగిందన్నారు. పాలకులు బాధితులకు మద్దతుగా ఉన్నారా నేరస్థులుగా ఉన్నారా అని తెలియడం లేదన్నారు. హోం మంత్రి ఇంటికి సమీపంలో ఉన్న కేజీహెచ్ కొండమీద గంజాయి సాగు జరుగుతుండగా రెడ్ హేండడ్‌గా పోలీసులు పట్టుకున్నారని, 4 నెలలుగా సాగుచేస్తుంటే ఏం చేస్తున్నారన్నారని ప్రశ్నించారు. దీనికి ఆమె రాజీనామా చేయాలన్నారు. మొన్నటికి మొన్న డీఎస్పీ కుప్పంలో ప్రెస్‌మీట్‌లో 84 ఎకరాలు గంజాయి సాగు చేస్తున్నారని ఎండబెట్టిన గంజాయి ఎంత ఉందని చెబుతుంటే పాలకులు ఎవరూ సిగ్గుపడటం లేదన్నారు. వంద రోజుల్లో గంజాయి లేకుండా చేస్తామన్న హామీ ఏమైందన్నారు. మాటలు కోటలు దాటుతుంటే చేతలు గడప దాటడం లేదన్నారు. ఇప్పటికైనా అక్రమకేసులు పక్కన పెట్టి ఆడపిల్లలకు రక్షణ ఇవ్వాలని, హామీలు నెరవేర్చాలని హితవు పలికారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -17 కుస్తీ పోటీలను పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంత అవసరమన్నారు. అనంతరం క్రీడాపతాకాని ఎగురవేసి క్రీడాపోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకుని కుస్తీ పోటీలను నాయకులు, అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల పట్ల బాధ్యతతో వారిని ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. యాదమరి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న అధికారులను, నాయకులను ఆయన అభినందించారు. విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని, మండలంలో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకునే క్రీడాకారులు ఉన్నారని తనకు తెలిసిన వెంటనే యాదమరిలో క్రీడాపోటీలు నిర్వహించేందుకు అవకాశం లేకపోయినా తానే చొరవ చూపి రెజ్లింగ్ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయిలో క్రీడాపోటీలు జరిగితే మరికొంతమంది క్రీడాకారులు తయారు అయ్యే అవకాశం ఉందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వంతో పాటుగా తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారిని రుక్మిణికు శాలువ కప్పి ఎమ్మెల్యే సత్కరించారు. టిడిపి మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, అమరనాథ్ నాయుడు, చిత్రా నాయుడు, చిట్టిబాబు నాయుడు, మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఎయిర్‌పోర్టులో ఆక్టోపస్ మాక్ ఆపరేషన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: ఆక్టోపస్, పోలీస్ దళాలు శనివారం వేకువజామున రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం లో మాక్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ అర్ధరాత్రి ప్రారంభమై ఉదయం వరకు కొనసాగింది. అనుకోని విధంగా ఎదైనా తీవ్రమైన ఘటనలు లేదా ఉగ్రమూకలు దాడికి పాల్పడితే సిబ్బంది, ప్రయాణికులు, సందర్శకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియ జేసేందుకు ఆక్టోపస్ దళాలు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు, ఫైర్ సర్వీసు, మెడికల్ డిపార్ట్మెంట్ వారు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు.



'ప్రజాపోరు' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాశక్తి-పలమనేరు: స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో శనివారం ప్రజాపోరు కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ప్రజాసమస్యలపై ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే ప్రజా పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జె.గిరిధర్ గుప్తా కోరారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజలు భాగస్వాములు కావాలని, 14వత ఏదీన ఎమ్మార్వో కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కారక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, పట్టణ శాఖ కార్యదర్శి రాజా, మహిళా శాఖ కార్యదర్శి జయంతి, ధనమ్మ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

'డీఈవో ఆదేశాలు మాకు వర్తించవు'

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్ : రెండో శనివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు దినంగా డీఈవో ప్రకటించారు. అయినా విద్యాధికారి ఆదేశాలను భేఖాతరు చేస్తూ చిత్తూరు నగరంలోని కేశవరెడ్డి, శ్రీచైతన్య, క్యాంఫర్డ్, న్యూయార్క్ వంటి ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు యధావిధిగా పాఠశాలలు నిర్వహించాయి. సెలవు రోజుల్లోనూ ప్రత్యేకక్లాసులు నిర్వహింస్తున్నారని పలువురు విద్యార్థులు వాపోయారు. సెలవు రోజుల్లోనూ విద్యార్థులు వివిధ క్రీడా, వినోదాలకు దూరమై పాఠశాలకు వెళ్లడం వారి మనోవికాసానికి ఆటంకంగా మారుతుందని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు చదివించి, సాయంత్రం ఇంటికి వెళ్లాక కూడా బండెడు హోంవర్కులతో ఇబ్బందులు పడుతుంటే సెలవు రోజుల్లోనూ పాఠశాలలు నడపడం పిల్లలను మరింత మానసిక వేదనకు గురిచేస్తోంది. ఇకనైనా ప్రభుత్వం సెలవు ప్రకటించిన రోజుల్లో పాఠశాలలు నిర్వహించకుండా విద్యాసంస్థలకు డీఈవో హెచ్చరికలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

చంగలరాయ మిట్ట..
సమస్యలు తీరేది ఎట్టా!

ప్రజాశక్తి- చిత్తూరుటౌన్: చంగలరాయ మిట్టలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. వారాల తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో కాలువల్లో చెత్తాచెదారం చేరి దుర్గంధం వెదజల్లుతుంది. దీనికి తోడు కాలువలకు ఇరువైపులా దట్టమైన చెట్లు పెరగడంతో దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్దులు దోమకాట్లకు గురై విష జర్వాల భారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని కాలువలు శుభ్రం చేయడంతోపాటు పిచ్చిమొక్కలను తొలగించాలని స్థానికుల కోరుతున్నారు.

వైద్యుల సలహాలు పాటించాలి

వైద్యాధికారిణి విజయలక్ష్మి



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి- సోమల: గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవానంతరం వరకు గర్భిణులు వైద్యుల సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని కందూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి విజయలక్ష్మి అన్నారు. శనివారం పీఎంఎస్‌వై కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోడిగుడ్లు, ఆకుకూరలు, పాలు, పండ్లు తప్పనిసరిగా ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలని తద్వారా బిడ్డకు ఆరోగ్యం సుఖప్రసవం అవుతుందని తెలిపారు. ఈసందర్భంగా 20 మందికి వైద్యపరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం పంపిణీ



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెలా పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు, సహాయక మేనేజర్ శ్రీనివాసులు సహకారంతో పౌష్టిక ఆహారం అందించారు. శనివారం పిహెచ్‌సికి వచ్చిన 72 మంది గర్భిణులకు ఆహారం అందించారు. అంతకు మందు డాక్టర్ విజయచంద్ర గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సలహాలు, సూచనలు వివరించారు.

సమాజసేవలో లయన్స్ క్లబ్ సభ్యులు



ప్రజాశక్తి- కుప్పం టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ వారియర్స్ కుప్పం సభ్యులు సమాజసేవలో ఎల్లప్పుడూ ముందుంటారు. క్లబ్ ప్రారంభం నాటి నుండి ఇప్పటి వరకు పలు రకాల సేవా కార్యక్రమాలను వారు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలను అందించడం, అన్నదాన, రక్తదాన కార్యక్రమాలను నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా క్లబ్ తరుపున ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రతినెలా రెండవ శనివారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల స్థానిక పిఈఎస్ ఆసుపత్రి వారి సహకారంతో జరిగిన వైద్యశిబిరంలో కంటి సమస్యతో బాధపడుతున్న వారు పెద్దసంఖ్యలో పాల్గొన్నట్టు తెలిపారు. వీరందరిని పరీక్షించిన వైద్యులు అందులో 21 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామన్నారు. వారికి త్వరలో స్థానిక పిఈఎస్ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు క్లబ్ సలహాదారులు డాక్టర్ మహేష్ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దు

- అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు..
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్ , సమావేశంలో హాజరైన సభ్యులు

ప్రజాశక్తి- యాదమరి

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వీడాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. శనివారం యాదమరి ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశంలో ముఖ్యంగా యాదమరి మండల అభివృద్ధిపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో కరువు నివారిత చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో మెలకువలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, గ్రామస్థాయిలో అధికారులు పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. మండల అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, అధికారులు భాధ్యతతో పనిచేయాలన్నారు. పార్టీలు ఏవైనా ప్రజల సంక్షేమం కోసం అరమరికలు లేకుండా పనిచేయాలన్నారు. యాదమరి –గుడియాత్తం అంతరాష్ట్ర రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించి, నవంబర్ నెల చివరి లోపు భూమిపూజ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పధకం ద్వారా లబ్ధి చేకూరేలా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన తీసుకుని రావాలని కోరారు. యాదమరిలో పరిశ్రమను తీసుకొచ్చి మహిళలకు ఉపాధి కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపడం జరిగిందని, అదేవిషయంలో నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళాను త్వరలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎలిఫెంట్ ట్రాకర్స్‌కు శిక్షణ



ప్రజాశక్తి - రామకుప్పం: అటవీ శాఖ అంతంతపురం రెంజ్ కాంజర్వేటర్ యశోద భాయ్, చిత్తూరు జిల్లా అటవీ శాఖ అధికారిని భరణి ఆధ్వర్యంలో శనివారం కుప్పం రేంజి పరిధిలోని ననియాల ఎలిఫెంట్ క్యాంప్‌లో రాష్ట్రంలోని 24 మంది ఎలిఫెంట్ ట్రాకర్స్‌కు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కర్ణాటక రాష్ట్రంలోని దుబారి ఎలిఫెంట్ క్యాంప్‌లో శిక్షణ పొందుటకు, కుంకీ ఆపరేషన్, ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యంగా అడవుల సంరక్షణ, అడవి జంతువుల సంరక్షణ వీరి విధి. ఈ కార్యక్రమంలో పలమనేరు సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, కుప్పం రేంజ్ ఆఫీసర్ జయశంకర్, కుప్పం రేంజ్ సిబ్బంది, ఎలిఫెంట్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ఎంపిడిఓ శ్రీధర్


ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఉమ్మడి వనరులను కాపాడుకోవాలని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీధర్ అన్నారు. శనివారం మండల కార్యాలయంలో ఉమ్మడి వనరుల సంరక్షణ కార్యక్రమం క్లస్టర్ కోఆర్డినేటర్ శ్యామల ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఇన్చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ మనిషి మనుగడ సాధించాలంటే వనరులను అభివృద్ధి చేసుకున్నప్పుడే సాధ్యమైతుందని గ్రామీణ ప్రాంతంలో చెట్లు నాటడం, పాల ఉత్పత్తి పెంచుకోవడం, సహజ వనరులను కాపాడే కార్యక్రమం చేయాలని వాటి ద్వారా ఉమ్మడి వనరులు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం రిసోర్స్ పర్సన్ తల్లా శ్రీనివాసులు వనరులను ఏ విధంగా కాపాడాలని వివరించారు.

ప్రమాదకరంగా మురుగు కాలువ



ప్రజాశక్తి- బంగారు పాళ్యం: మండల కేంద్రంలోని పాత తపాలా కార్యాలయం సమీపంలో నాలుగు మురుగునీటి కాలవలు కలిసే గుంతలో శనివారం సైకిల్ తొక్కుని వస్తున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించబోయి పడిపోయాడు. వెంటనే స్థానికులు గుర్తించి అతన్ని బయటకు తీశారు. కాలువ చుట్టూ గోడ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ఇకనైన సంబంధిత అధికారులు స్పందించి కాలువకు పిట్టగోడ నిర్మించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటరు జాబితాలో సవరణలు



ప్రజాశక్తి- చౌడేపల్లి: ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే సరిచూసుకోవాలని తహశీల్దార్ హనుమంతు నాయక్ తెలిపారు. శనివారం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో చిరునామా, పేర్లు మార్పు, నూతనంగా పేర్లను నమోదు చేయించుకునే కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ వరకు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని కోరారు. విజయ్ కుమార్ రెడ్డి, మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'అభివృద్ధికి ప్రణాళికలు'

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు మంగళ,బుధవారాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాలాజీ, గ్రామపంచాయతీ విస్తరణ అధికారి శారదా దేవి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ రెడ్డప్ప ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈకార్యక్రమానికి మండలంలోని జడ్పిటిసి, సర్పంచులు, ఎంపిటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, మండలాధికారులు హాజరు కావాలని కోరారు.

డ్యాం నిర్మాణం వద్దంటూ రైతుల వినతి

ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి - కార్వేటినగరం:

మండలంలోని ముక్కరవాణిపల్లె వద్ద నూతనంగా ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డ్యాం నిర్మాణం వద్దు అంటూ చుట్టుపక్కల ఏడు గ్రామాల రైతులు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు విన్నవించుకున్నారు. శనివారం ముక్కరవానిపల్లె వద్ద గత ప్రభుత్వ హయాంలో డ్యాం నిర్మాణం కోసం రూ.90కోట్లతో మంజూరైనట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. డ్యాం నిర్మాణం చేపడితే ముక్కరవాణిపల్లె, కత్తెరపల్లె, కత్తెరపల్లె దళితవాడ, గంగమాంబాపురం, రాచపాళ్యం, పొన్నగల్, కొత్తూరు, ఆలత్తూరు గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోతారని సర్పంచ్ గుణవతి, రైతులు తెలిపారు. ఎన్నికల ముందు టిడిపి ప్రభుత్వం డ్యాం నిర్మాణం రద్దు చేస్తామని హామీ ఇచ్చారని రైతులు ఎమ్మెల్యేకు గుర్తు చేశారు. కృష్ణాపురం డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, తమకు కొత్త డ్యాం అవసరం లేదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం రైతలకు మేలు చేసే విధంగా చూస్తుందని, రైతులకు ఎటువంటి నష్టం జరగదని హామీ ఇచ్చారు. అనంతరం ఏటి కాలువ వద్ద పనులను పరిశీలించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు నాయుడు, మండల అధ్యక్షులు చెంగల్రాయల యాదవ్, ఇరిగేషన్ ఎస్‌సి విజయ్ కుమార్ రెడ్డి, ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, డీఈ మురళి, ఏఈలు రవిప్రకాష్ నాయక్, నాయకులు నాగేశ్వర రాజు, బి.రమేష్, జి. మహేష్, తిరుమలయ్య, ప్రసాద్, మోహన్, గణేష్, కిరణ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే థామస్‌తో మాట్లాడుతున్న రైతులు

టిటిడి బోర్డు సభ్యులు కృష్ణమూర్తి యాదవ్‌కు ఘనస్వాగతం



ప్రజాశక్తి- పుంగనూరు: నూతన టిటిడి బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి యాదవ్‌కు పట్టణంలో ఘన స్వాగతం లభించింది. మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్ శనివారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గోపాల్ స్వగృహంలో టిడిపి నాయకుల సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జంగా కృష్ణమూర్తి యాదవ్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం బీసీ సామాజికవర్గానికి సముచిత స్థానం కల్పించిందన్నారు. బీసీలందరూ కలిసికట్టుగా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి కోరారు. గోపాల్ మాట్లాడుతూ టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి యాదవ్ కార్మిక వర్గాల్లో కార్మిక సమస్యలపై పనిచేసిన అపారమైన అనుభవం ఉందని, బీసీ నేతగా మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు, లక్ష్మీపతి యాదవ్, బీసీ సంఘం నేత కృష్ణమూర్తి, రాజారెడ్డి, నాగరాజు పాల్గొన్నారు. అనంతరం జంగా కృష్ణమూర్తి యాదవ్‌ను మాజీ ముడా ఛైర్మన్ ఎం.వెంకట్ రెడ్డి యాదవ్ ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం కృష్ణమ్మరెడ్డిపల్లి వద్ద ఉన్న శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించారు.

పొన్నురంగంను ఆదర్శంగా తీసుకోవాలి: ఎంఈవో

ప్రజాశక్తి - కార్వేటినగరం: విశ్రాంతి ఉపాధ్యాయుడు పొన్నురంగం సేవలు మరువ లేనివని మండల విద్యాశాఖ ఆధికారి ఎం.విజయకుమార్ అన్నారు. ఎమ్మార్సీ భవనం ఎదుట దాత పొన్నురంగం దంపతులు సొంతనిధులతో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పొన్నురంగం కోదండరామాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులకు విద్యాబోధనలు అందించడమే కాకుండా వారికి కావాల్సిన నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని ప్రతిఏటా అందించి పిల్లలు పెద్దదిక్కుగా నిలిచే వారని గుర్తు చేశారు. అలాగే ఎమ్మార్సీ భవనానికి గతంలో తన సొంత నిధులు వెచ్చించి గేట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కూడా విద్యావ్యవస్థపై తమ దాతృత్వాన్ని చాటుకుంటున్న పొన్నురంగం సేవలను ఉపాధ్యాయులు కూడా ఆదర్శంగా తీసుకోవాలని, ఈయన విద్యారంగంలో పనిచేయడం అభినందనీయమని కొనియాడారు.



సమన్వయంతో పూర్తి చేయండి: ఎంపీడీవో బాలాజీ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: ప్రజాఅవసరమైన సర్వేలన్నీ సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో బాలాజీ అన్నారు. శనివారం రాజుపల్లి, పెద్దవెలగటూరు, సచివాలయాల పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను ఎంపీడీవో పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా ఈసర్వే కార్యక్రమాలన్నిటిని పూర్తిచేయాలని ఆయన సూచించారు. యూడిఐడి కార్డులు లేని ప్రత్యేక ప్రతిభావంతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రతి ఇంటికి హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ తప్పనిసరి, అన్ని బ్యాంకు అకౌంట్లకు ఎన్పీసీఐ ద్వారా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. మాజీ టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భాను ప్రతాప్ రెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కార్డులు లేని గిరిజనుల కోసం ప్రత్యేక సర్వే

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని ఎస్టీల కోసం ప్రత్యేక సర్వే కార్యక్రమం జరుగుతోందని ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేని గిరిజనులు తక్షణమే వారి వివరాలను సెల్ఫ్ డిక్లరేషన్ ఫారాలను పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలకు అందజేయాలని, సంబంధిత అధికారులు పై సామాజిక వర్గా ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో సూచించారు.



రాజుపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

'సదస్సును జయప్రదం చేయండి'



ప్రజాశక్తి - సదుం: ఈనెల 14వతేదీన మదనపల్లిలో జరగనున్న మాదిగల ఆత్మీయ సదస్సుకు ఎస్సీ వర్గీకరణ సారథి మందకృష్ణ మాదిగ రానున్న సందర్భంగా సదుం నుండీ పెద్దఎత్తున మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి కోరారు. శనివారం సదుం గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల ఆత్మీయ సదస్సుకు మండల పరిధిలోని మాదిగ సామాజిక వర్గాన్ని కుటుంబ సభ్యులు పెద్దఎత్తున హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. పుంగునూరు ఎంఎస్‌పి కోఆర్డినేటర్ శివయ్య, టిడిపి వెంకటరత్నం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చింతపల్లి రామచంద్రయ్య, నాగరాజ, ప్రకాష్, మాటూరి వెంకటరామయ్య, గోవిందు, వెంకటేష్, హనుమంతు, వెంకటేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: బెల్ట్ షాపు నడుపుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం రాగిమానుపెంట గ్రామానికి చెందిన ఈశ్వరయ్య గ్రామంలో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అతని అదుపులో తీసుకుని విచారించగా అతని వద్ద అక్రమంగా నిల్వ ఉన్న మద్యంను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

1800 లీటర్ల సారా ఊట ధ్వంసం



ప్రజాశక్తి- విజయపురం: నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల విజయపురం మండలంలో కె.వి.పురం గ్రామం స్వామి చెరువు సమీపంలో దాడులు నిర్వహించగా సుమారు 1800 లీటర్లు నాటు సారా తయారీ కోసం ఉంచిన ఊటను అధికారులు ధ్వంసం చేశారు.

సోషల్ మీడియాలో
పోస్టు చేసిన వ్యక్తి అరెస్టు



ప్రజాశక్తి- కార్వేటినగరం

సోషల్ మీడియాలో ఫోటోను అసభ్యకరంగా పోస్టు చేసిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ హనుమంతప్ప కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోషల్ మీడియాలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెంది కార్నెసైదిరెడ్డి ఫోటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి ఫేస్బుక్, సోషల్ మీడియాలో 2024 ఆగస్టులో పోస్టు చేసినట్లు గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సాంకేతిక నైపుణ్యంతో అతనిని గుర్తించి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా ఎవరైనా మహిళల ఫోటోలను అసభ్యకరంగా చిత్రికరించి ఫోస్టుచేసినా, అలాగే ఇతరలకు షేర్ చేసినా పరువుకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

చిరుత దాడిలో పాడిఆవు మృతి



ప్రజాశక్తి- చౌడేపల్లి:

చిరుత పులి దాడిలో మరో పాడి ఆవు మృతి చెందిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పెద్దకొండామరి పంచాయతీ నాగిరెడ్డిపల్లికి చెందిన వెంకట రమణారెడ్డికి చెందిన పాడి ఆవులను కొన్ని రోజుల క్రితం సమీపంలోని కందూరు బీట్ అటవీప్రాంతంలోకి మేత కోసం తరలించారు. సాయంత్రం పశువులన్నీ ఇంటికి చేరుకోగా ఒక పాడి ఆవు మాత్రం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వెతికిన ఫలితం లేకపోవడంతో ఇంటికి వచ్చేసారు. శనివారం చిరుత దాడిలో మృతిచెందిన ఆవును గుర్తించిన పశువుల కాపర్లు గుర్తించి రైతుకు తెలియజేశారు. రైతు వెళ్లి మృతి చెందిన ఆవును చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు ఇంద్రాణి, ప్రభాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన ఆవుకు పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత సంచరిస్తూ ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అనుమానాస్పద వ్యక్తులపై
సమాచారం ఇవ్వండి: ఎస్ఐ



ప్రజాశక్తి - రామకుప్పం: గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే కొత్త వ్యక్తులపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని రామకుప్పం ఎస్సై వెంకట మోహన్ కోరారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పట్టణంలోని వ్యాపారస్తులు, చిల్లర దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు తమతమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, తమ వద్దకు వచ్చే అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీస్ సిబ్బంది సమాచారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా దుకాణదారులు తమ తమ అంగళ్ళ ముందర రోడ్డుకు అడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ నరసింహారాజు, సబ్ ఇన్స్పెక్టర్ స్వర్ణ తేజ గంటా ఊరు కాలనీ, పలమనేరు టౌన్‌లో ప్రజల సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత, మహిళలపై అఘాయిత్యాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయమని తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మణి తెలిపారు. శనివారం ఆయన, వినోద్ కుమార్‌తో కలిసి చెక్కునత్తం పంచాయతీ ములకలపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.